రుయాలో ప్రత్యేక డయేరియా వార్డు



టాస్క్‌ఫోర్స్ టీంతో మాట్లాడుతున్న అధికారులు

తిరుపతి తుడా: డయేరియా బాధితుల కోసం తిరుపతి రుయా ఆసుపత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డయేరియా బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ మేరకు తిరుపతి రుయాలో బాధితుల కోసం స్పెషల్ వార్డును ఏర్పాటు చేశారు. డయేరియా బారిన పడ్డ బాధితులకు మెరుగైన వైద్య చికిత్సను అందించేందుకు 20 పడకలతోపాటు మరో ఐదు ఐసీయూ పడకలను అందుబాటులో ఉంచారు. అత్యవసర మందులను, ఇతర సదుపాయాలను అధికారులు సమకూర్చారు. డయేరియా చికిత్స, వైద్య సదుపాయాలపై వైద్యులు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు.

టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటు

డయేరియా వ్యాప్తిని అరికట్టడం, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, నెఫ్రాలజీ, మైక్రోబయాలజీ విభాగాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక హెడ్ నర్స్, ఫార్మాసిస్ట్‌తో కూడిన టాస్క్‌ఫోర్స్ టీంను నియమించారు. శనివారం నుంచి ఈ బృందం క్షేత్రస్థాయిలో పని చేయనుంది.

వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

డయేరియా నివారణ బాధితులకు అవసరమైన వైద్యాన్ని అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉండాలని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు తెలిపారు. ఈ మేరకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థుల ద్వారా హెల్త్ ఎడ్యుకేషన్ అవగాహన కార్యక్రమాల్ని విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు.

ఆక్రమణల తొలగింపుపై నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద బాధితులు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ యంత్రాంగం ఆక్రమణలపై కొరడా ఝళిపిస్తోంది. గురువారం గాంధీరోడ్డులో ఆక్రమణలు తొలగించే క్రమంలో దశాబ్దాలుగా పూసలు, దువ్వెనలు తదితర సామగ్రిని విక్రయించే నక్కలోళ్లను తొలగించి, సామగ్రిని కార్యాలయానికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో వారు మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని శుక్రవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. తమ సామగ్రి ఇప్పించాలని, ఇతరులకు అసౌకర్యం లేకుండా విక్రయించుకుంటామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ నరసింహాచారి కలగజేసుకొని టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

బడి ఈడు పిల్లలను గుర్తించండి

చంద్రగిరి: బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా విద్యాశాఖ అధికారులు చొరవ చూపాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ పెంచలయ్య తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన ఎంపీడీఓ డాక్టర్ సూర్యసాయితో పాటు మండల విద్యాశాఖ అధికారులతో కలసి స్థానిక బాలుర ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల చిన్నారులందరూ బడిలో ఉండేందుకు ప్రవేశపెట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. చంద్రగిరి ఉర్దూ పాఠశాల, ఐతేపల్లిలోని ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు పాల్గొన్నారు.



చంద్రగిరి టవర్‌క్లాక్ వద్ద మానవహారం

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 60,782 మంది స్వామివారిని దర్శించుకోగా 30,100 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బాల్య వివాహాలు నిర్మూలించాలి



చిన్నగొట్టిగల్లులో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

భాకరాపేట: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని పేర్కొన్నారు. చిన్నగొట్టిగల్లులో శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. అంగన్‌వాడీల సెక్టార్ సమావేశంలో డయేరియాపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని, హెల్త్ సూపర్‌వైజర్ వసంత అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

టీటీడీ ఈఓ దృష్టికి ఉద్యోగుల సమస్యలు



టీటీడీ ఈఓ జె.శ్యామలరావుతో ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం టీటీడీ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు అడసలపల్లి వాసు ఆధ్వర్యంలో ఈఓ జె.శ్యామలరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈఓకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఈవో దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఉద్యోగులకు అందుబాటులో ఉంటానని.. ఎలాంటి సమస్యలనైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి ముని వెంకట్‌రెడ్డి, గోల్కొండ వెంకటేశం, డైరెక్టర్ చింతల శివకుమార్, డైరెక్టర్ బచ్చల హేమలత పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



శ్రీవారిని దర్శించుకున్న సినీ నటి హేమ

తిరుమల: తిరుమల శ్రీవారిని తెలంగాణ ఎమ్మెల్సీ సుంకర రాజు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సినీనటి హేమ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

మెకానిక్ మునిరెడ్డికి ఆర్థిక సాయం



ఆవుల మునిరెడ్డికి ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రమాదవశాత్తు గాయాలపాలై వైద్య చికిత్స పొందుతున్న తిరుపతి టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మెకానిక్ ఆవుల మునిరెడ్డికి శుక్రవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. గురువారం ఇంటి వద్ద ప్రమాదవశాత్తు కింద పడి ముక్కు ఫ్రాక్చర్, దంతాలు దెబ్బతినడంతో ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందారు. ఈ నేపథ్యంలో అసోసియేషన్ నేతలు, సభ్యులు స్పందించి ఆర్థిక సాయం అందించి భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం అందించిన వారిలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మల్లీశ్వరన్, కార్యదర్శి జలంధర్, కమిటీ ఇన్‌చార్జ్ సోము, గురు ఆచారి, కృష్ణారెడ్డి, బాలాజీ యూనియన్ ప్రతినిధి పల్సర్ బాషా ఉన్నారు.

పీహెచ్‌సీకి వాటర్ ప్యూరిఫయిర్



వాటర్ ప్యూరిఫయిర్‌ని అందించిన బాలాజీశెట్టి, కుటుంబ సభ్యులు

పాకాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పాకాల పట్టణానికి చెందిన బాలాజీ శెట్టి శుక్రవారం వాటర్ ప్యూరిఫయిర్ బహూకరించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు తాగునీటి సౌకర్యం కల్పించడానికి తాను ఉచితంగా ఓల్టాస్ వాటర్ డిస్పెన్సర్ని అందించినట్లు బాలాజీ శెట్టి తెలిపారు. డాక్టర్ మురళీకృష్ణ, ఈఓపీఆర్డీ మాలతి, ఫార్మసిస్ట్ వేణు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదం కేసులో ఆటో డ్రైవర్‌కు జైలు

తిరుపతి లీగల్: ఆటోను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఓ వ్యక్తి మృతికి కారకుడైన కేసులో ఆటోడ్రైవర్‌కు జైలు శిక్ష విధించారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ, రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ సి.మురళీకి మూడు నెలల 15 రోజులు జైలు శిక్ష, 5000 రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు.

చెక్‌బౌన్స్ కేసులో మహిళకు..

చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి సిరిపురానికి చెందిన ఎల్.పద్మకు ఒక ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ఓ ఫ్లాట్ విక్రయానికి సంబంధించి తిరుపతి రూరల్, తుమ్మలగుంటకు చెందిన డి.భాస్కర్‌రెడ్డికి పద్మ ఒక రూ.1,38,575 విలువ చేసే చెక్కును 2018 జనవరి 31వ తేదీన ఇచ్చారు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా అది బౌన్స్ అయింది. దీంతో అతను కోర్టులో చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఎల్.పద్మకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే చెక్కు సొమ్ము అతనికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

రుణాల మంజూరులో తెలుగు రాష్ట్రాలే ప్రథమం



రుణాల పంపిణీలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీలు రాధమ్మ, తులసి, బ్యాంకు జీఎం చంద్రశేఖర్ తదితరులు

తిరుపతి (అలిపిరి): మహిళా సంఘాలకు రుణాల మంజూరులో దేశంలో తెలుగు రాష్ట్రాలే ప్రథమస్థానంలో ఉన్నాయని తిరుపతి ఇండియన్ బ్యాంక్ జీఎం చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం తిరుపతి నగరం తుడా ప్రాంగణంలోని కచ్చపి ఆడిటోరియంలో ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో రుణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సభ్యుల కోసం లక్షపతి దీదీ పథకంతో రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇండియన్ బ్యాంక్ ఎఫ్‌జీఎం రాజశేఖర్ ప్రతి ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు ఇండియన్ బ్యాంక్ మొబైల్ యాప్ ఇండ్ స్మార్ట్‌ను విరివిగా ఉపయోగించుకోవాలని కోరారు. తిరుపతి మెప్మా పీడీ రాధమ్మ మాట్లాడుతూ బ్యాంకు రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని.. ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. బ్యాంకు మొబైల్ యాప్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. తిరుపతి డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి మాట్లాడుతు పెద్ద ఎత్తున రుణ వితరణ కార్యక్రమం చేసిన ఇండియన్ బ్యాంకు సేవలను కొనియాడారు. వారికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. చిత్తూరు డీఆర్‌డీఏ పీడీ డీఎంకే తులసి మాట్లాడుతూ చక్కటి ఆర్థిక ప్రణాళికతో ప్రతి బృందం సభ్యురాలు అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం రుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ ఎఫ్‌జీఎంఓ పరిధిలో వివిధ బ్యాంకు జోన్లు మొత్తంగా రూ.610 కోట్లు ఒక్క రోజులో రుణ వితరణ చేసినట్లు బ్యాంకు జీఎం తెలిపారు. ఇందులో తిరుపతి జోనల్‌లో రూ.205 కోట్లు, అమరావతిలో రూ.75 కోట్లు, విజయవాడలో రూ.90 కోట్లు, కరీంనగర్‌లో రూ.90 కోట్లు, రాజమండ్రిలో రూ.85 కోట్లు, విశాఖపట్నంలో రూ.70 కోట్లు, హైదరాబాద్‌లో రూ.45 కోట్లు రుణ వితరణ చేసినట్లు ఆయన వివరించారు. అనంతరం ఉత్తమ ఎస్‌హెచ్‌జీలను సన్మానించారు. కార్యక్రమలో తిరుపతి జోనల్ మేనేజర్ ఎం.సెల్వరాజ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ బాల చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఇద్దరికి మూడేళ్లు జైలు శిక్ష

తిరుపతి లీగల్: అప్పు ఇచ్చిన వ్యక్తికి ఉద్దేశపూర్వకంగా ఒకరి పేరుతో ఉన్న చెక్కును మరొకరు ఇచ్చి మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులకు మూడేళ్లు జైలు శిక్ష, ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తరఫు న్యాయవాది వెంకట కుమార్ తెలిపిన కేసులోని వివరాలిలా ఉన్నాయి. తిరుపతి కొర్లగుంట వివేకానంద వీధికి చెందిన కె.శ్రీనివాసులు, కె.ఓంకారలక్ష్మీ తమ అవసరాల కోసం 2011 ఆగస్టు నెలలో తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన పి.పురుషోత్తం వద్ద నాలుగు లక్షల రూపాయలను అప్పుగా తీసుకున్నారు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో 2011 సెప్టెంబర్ 14వ తేదీ ఓంకారలక్ష్మి పేరుతో ఉన్న చెక్కును శ్రీనివాసులు సంతకం చేసి పురుషోత్తంకు ఇచ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా బ్యాంక్ అధికారులు చెక్కును వెనక్కి పంపారు. దీంతో పురుషోత్తం చెక్కు ఇచ్చే సమయంలో భార్యాభర్తలు ఇద్దరూ ఉన్నారని, కావాలనే నిందితుడు తనను మోసం చేసి చెక్కును ఇచ్చాడని కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి భార్యాభర్తలు ఇద్దరూ నేరం చేసినట్టు భావించి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు

శాంతిభద్రతలు కాపాడుతాం

పాకాల: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి సీఐ శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం మండలంలో శాంతి భద్రతలు కాపాడేందుకు ముఖ్య కూడళ్లలో పోలీసులను ఏర్పాటు చేయడంతోపాటు పెట్రోలింగ్ నిర్వహించి పటిష్టమైన నిఘా ఏర్పాట్లు చేశామన్నారు. కొన్ని సందర్భాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కొన్ని సంఘటనలు చోటుచేసుకున్నాయని, వీటిని దృష్టిలో ఉంచుకొని ఇకపై మరింత పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

అడిపోజెనిసిస్‌పై అవగాహన

తిరుపతి సిటీ: ఎస్వీయూ మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ సెనేట్ హాల్‌లో పాండమిక్ డిసీజెస్ టార్గెటింగ్ స్ట్రాటజీస్ అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూఎస్‌ఏ అట్లాంటాలోని మోర్‌హైస్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కామేశ్వరరావు బద్రి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అడిపోజెనిసిస్(కొవ్వు కణాలు)పై విద్యార్థులకు, పరిశోధకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్లు కేటీ రామకృష్ణారెడ్డి, కామాక్షమ్మ, అప్పారావు, పి.సుమతి, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నవభారత నిర్మాతలు



ఉపాధ్యాయిని దంపతులను సత్కరిస్తున్న డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు నవభారత నిర్మాతలని తిరుపతి డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. బైరాగిపట్టెడలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఎస్‌జీటీ ఉపాధ్యాయిని సుంకర ప్రభావతి పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్ది సమాజానికి మంచి పౌరులుగా అందిస్తూ నవభారత నిర్మాణానికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి గొప్పదని, బావిభారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే అవకాశం ఒక ఉపాధ్యాయ వృత్తికే ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు తమ గురుతర బాధ్యతను గుర్తెరిగి విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని కోరారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఎస్‌జీటీ ఉపాధ్యాయిని సుంకర ప్రభావతి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ కె.బాలాజీ, ఎంఈఓ–2 బి.భాస్కర్‌నాయక్, కార్పొరేటర్ తూకివాకం శాలిని, ఎంజీఎం హైస్కూల్ హెచ్‌ఎం మురుగన్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎ.వాసు, ఉపాధ్యాయులు బండి మధుసూదన్‌రెడ్డి, రవికుమార్, మునిశారద తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఐదుగురికి జైలు

తిరుపతి లీగల్: భూమి విక్రయానికి సంబంధించి ఓ వ్యక్తిని మోసం చేసిన కేసులో ఐదుగురికి మూడేళ్లు చొప్పున జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిర్మల, కోర్టు కానిస్టేబుల్ దేవేంద్ర తెలిపిన కేసులోని వివరాలిలా ఉన్నాయి. తిరుపతికి చెందిన బి.హేమంత్‌కుమార్‌రెడ్డి 2007 సెప్టెంబర్ 5వ తేదీ చంద్రగిరి మండలం, మిట్టపాలెం గ్రామ లెక్క దాఖలాలోని వివిధ సర్వే నెంబర్లలోని రెండు ఎకరాలా 44 సెంట్లు భూమిని కొనడానికి తిరుపతి బైరాగిపట్టెడలోని గొట్టిగల్లు కిషోర్‌ను కలిశారు. భూ విక్రయానికి అంగీకరించిన కిషోర్ అతని వద్ద కొంత సొమ్మును అడ్వాన్సుగా తీసుకున్నాడు. దీనిలో భాగంగా సర్వే నెంబర్ 348/1, 5లోని ఒక ఎకరా 28 సెంట్లు భూమికి సంబంధించి కొంత సొమ్మును అడ్వాన్స్ తీసుకొని అగ్రిమెంట్ రాసి ఇచ్చాడు. అగ్రిమెంట్ సమయం దాటుతున్నా కిషోర్ అతని పేరున భూమి రిజిస్టర్ చేయించలేదు. దీంతో హేమంత్‌కుమార్‌రెడ్డి రికార్డులను పరిశీలించగా కిషోర్ తన బంధువైన తిరుపతి ఎంఆర్‌పల్లికి చెందిన సి.దేవకీకి ఆ భూమిని విక్రయించినట్లు విక్రయ పత్రం రాసినట్లు తెలుసుకున్నాడు. దీంతో తనకు భూమి విక్రయిస్తానంటూ నమ్మబలికి అడ్వాన్సుగా రూ.10 లక్షలు దాకా సొమ్ము తీసుకుని మోసం చేసినందుకు కిషోర్‌తోపాటు అతనికి సహకరించిన అతని తల్లి జి.సిద్ధ మునెమ్మ, తిరుపతి ఎంఆర్ పల్లికి చెందిన సి.దేవకి, సి.పూర్ణచంద్రారెడ్డి, తిరుపతి లింగేశ్వర్ నగర్‌కు చెందిన సి.నిరంజన్ రెడ్డి, తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన జి.సులోచనపై చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణ దశలో సిద్దమునెమ్మ మృతి చెందారు. మిగతా ఐదుగురిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

బోధనేతర సిబ్బంది నామినేషన్ల హడావుడి



నామినేషన్లు దాఖలు చేస్తున్న బోధనేతర సిబ్బంది

తిరుపతి సిటీ: ఎస్వీయూలో నాన్ టీచింగ్ అసోసియేషన్‌కు వచ్చే నెల 11న జరుగనున్న ఎన్నికలలో పోటీ చేసేందుకు శుక్రవారం పెద్ద సంఖ్యలో సిబ్బంది నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధానంగా కెజగురుప్రసాద్, జె.లక్ష్మీనాథ్, లేడీ రెప్రజెంటేటివ్‌గా ఎం.కృష్ణ కుమారి తదితరులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి షఫి వద్ద నామినేషన్లు దాఖలు చేశారు.

ఎస్వీసీఈలో ఉచిత దంతవైద్య శిబిరం



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, ఫిరోజ్ డెంటల్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రావు, డాక్టర్ షేక్ రఫీ కిరణ్, చంద్రశేఖర్, డాక్టర్ సుజన కుమార్, డాక్టర్ చంద్రయ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10.30 గంటలకు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ గురునాథ్ తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం 8 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులతోపాటు, వ్యాజ్యం వేయని కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించనున్నట్టు న్యాయమూర్తి తెలిపారు

59 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందికి ఒక లక్షా 50 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. తిరుపతి అర్బన్ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, సీఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు తిరుపతిలో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరి తెలిపారు. మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న 15 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 44 మందికి ఒక్కొక్కరికి రూ.200 చొప్పున న్యాయమూర్తి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.